సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం, 4, నవంబర్, 2024



తీరంలో మద్యం ఏరులు

నరసాపురం ప్రాంతంలో మద్యం ఏరులై పారుతోంది. తీర గ్రామాల్లో బెల్ట్ షాపుల కోసం బహిరంగ వేలం పాటలు పెడుతున్నారు. 8లో



ఇసుకలో దళారుల రాజ్యం

ఎర్రకాలువ, జల్లేరు, బైనేరు వాగుల నుంచి ట్రాక్టర్లపై ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. దళారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. 8లో



హత్యపై వీడని అనుమానాలు

తణుకులో జరిగిన దుర్గారావు హత్య కేసులో పురోగతి లేదు. టీడీపీ నేత ప్రమేయం ఉన్నట్లు సోషల్ మీడియాలో లేఖ చర్చనీయంగా మారింది. 8లో

న్యూస్‌రీల్

సోమేశ్వరుడి శోభ



విశేష అలంకరణలో స్వామివారు

భీమవరం (ప్రకాశం చౌక్) : పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమా సోమేశ్వర, జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, పంచారామ యాత్రికులు తరలివచ్చారు. రెండో రోజు ఆలయానికి మొత్తంగా రూ.1,61,181 ఆదాయం లభించినట్టు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. 3,500 మంది భక్తులు అన్నప్రసాద వితరణ చేశామన్నారు.

డెంగీ పేరుతో వసూళ్లను సహించం

సాక్షి స్పందన

తణుకు : డెంగీ పేరుతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. 'జ్వరాలతో వణికిపోతున్న జనం' పేరుతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 36 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని, డెంగీ నిర్ధారించే అర్హత ప్రైవేట్ ఆస్పత్రులు, లేబొరేటరీలకు లేదన్నారు. ఎలీసా టెస్టు ద్వారా మాత్రమే డెంగీని నిర్ధారించవచ్చని, ఈ పరీక్షలు తణుకు, తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు ఆస్పత్రులు, లాబొరేటరీలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రోగులు, వారి బంధువులు అధైర్యపడి మోసపోవద్దని డీఎంహెచ్ఓ మహేశ్వరరావు సూచించారు.

డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మేనేజర్, ఉద్యోగులు

తణుకు అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లంతా బస్సుల ఫిట్‌నెస్‌పై సంతోషకరంగా ఉంటూ ఏకాగ్రతతో విధి నిర్వహణలో ఉండాలని తణుకు డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించి బస్సు కండీషన్‌ను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా మొదటి మూడు రోజులు డ్యూటీ దిగిన డ్రైవర్లు వెహికల్ కండిషన్‌తో పాటు ఎలాంటి మరమ్మతులు ఉన్నా 7వ తేదీ లోపు మరమ్మతులు పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గ్యారేజ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, చంద్రశేఖర్, ఆయిల్ డీసీ ఆలీ, ఎస్‌డీఐ కల్యాణరాజు, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

రాట్నాలమ్మా నమోస్తుతే



పెదవేగి : మండలంలోని రాట్నాల కుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో విశేష పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.41,860 లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

సాధికారత ఊసే లేదు..
ఉపాధి పట్టదు

భీమవరం(ప్రకాశం చౌక్) : రాష్ట్రంలో మహిళా సాధికారత.. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవశకం పేరిట సంక్షేమ పథకాలను అమలు చేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి బీసీ కార్పొరేషన్ ద్వారా నవశకం పేరిట ఐదు పథకాలను చిత్తశుద్ధితో అమలు చేశారు. ఏటా క్యాలెండర్‌ను ప్రకటించి నిర్ణీత సమయంలో లబ్ధిదారులకు సాయం అందించడం ద్వారా చిన్నపాటి వ్యాపారాలు, స్వయం ఉపాధికి భరోసాగా నిలిచారు. కాపునేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం, ఇంటింటికీ రేషన్ పథకాలను పక్కాగా అమలు చేసి పేదల ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటు అందించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం చూపుతుండటంతో ఆయా వర్గాలకు ఆర్థిక భరోసా దూరమైంది. చిన్నపాటి వ్యాపారాల నిర్వహణ, కుటుంబ అవసరాలు, ఆరోగ్య ఖర్చులకు కూడా అప్పులు చేయాల్సి వస్తోంది.

నాడు నవశకం..
నేడు అంతా శూన్యం

- జగన్ సర్కారులో నవశకం పేరిట పథకాల అమలు
- జిల్లాలో రూ.615 కోట్లకు పైగా ఖర్చు
- మహిళా సాధికారత.. యువత ఉపాధికి పెద్దపీట
- నేడు పథకాలు అందక.. సాయం దరిచేరక అవస్థలు
- ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ప్రజల ఎదురుచూపులు

వ్యాపారం.. దినదినగండం

కూటమి నేతలు ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అంటూ హామీలను గుప్పించినా.. గద్దెనెక్కిన తర్వాత పూర్తిగా విస్మరించారు. దీంతో పథకాల లబ్ధి అందక గత ప్రభుత్వంలో నవశకం ప్రోత్సాహంతో ప్రారంభించిన వ్యాపారాల నిర్వహణకు ప్రస్తుతం లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. పెట్టుబడులు లేక, అద్దెలు కట్టలేక అవస్థలు పడుతున్నారు. అద్దె షాపుల్లో వృత్తిపరమైన పనులు చేసుకునేవారికి గడ్డుకాలం నడుస్తోంది. ప్రైవేట్ అప్పుల బాట పడుతున్నారు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో పలువురు మహిళలు చిన్నపాటి వ్యాపారాలు ప్రారంభించారు. ముఖ్యంగా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. వీరంతా ప్రస్తుతం ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో వ్యాపారాల నిర్వహణ ఎలా అని ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో రూ.615 కోట్ల లబ్ధి

గత ప్రభుత్వంలో నవశకం కింద ఐదు పథకాలకు సుమారు రూ.615.25 కోట్లు ఖర్చు చేశారు. జగన్ పాలన చేపట్టిన మొదటి ఏడాది నుంచే పథకాల లబ్ధి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. కరోనా విపత్తు సమయంలోనూ పథకాల ద్వారా ప్రజలను ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి నాలుగు నెలలు గడిచినా ఇప్పటికీ పథకాలపై స్పష్టత ఇవ్వడం లేదు.



నాడు బడుగులకు నిండుగా 'చేయూత'

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేల సాయం అందించారు. ఎన్నికల అనంతరం కూడా జిల్లాలో 23 వేల మందికి ఆఖరి సంవత్సం సాయం అందించారు. వీటితో మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. జిల్లాలో 2020–21లో 51,516 మందికి రూ.96.59 కోట్లు, 2021–2022లో 51,000 మందికి రూ.95.62 కోట్లు, 2022–2023లో 70,212 మందికి రూ.131.14 కోట్లు, 2023–2024లో 23,000 మందికి రూ.43.12 కోట్లు సాయం అందించారు. మొత్తంగా 1,95,728 మందికి రూ.366.47 కోట్ల సాయం అందించారు.

మహిళల 'కాపు' కాసిన నేస్తం

గత ప్రభుత్వం కాపు మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.60 వేలు సాయం అందించింది. దీంతో పలువురు చిన్నపాటి వ్యాపారాలు ప్రారంభించారు. జిల్లాలో 2020–21లో 24,199 మందికి రూ.36.29 కోట్లు, 2021–2022లో 21,815 మందికి రూ.32.71 కోట్లు, 2022–2023లో 31,361 మందికి రూ.47.04 కోట్లు, 2023–2024లో 34,642 మందికి రూ.51.96 కోట్ల సాయం అందించారు. మొత్తంగా 1,12,017 మందికి రూ.168 కోట్ల లబ్ధిని చేకూర్చారు.

వృత్తిదారులకు 'చేదోడు'వాదోడుగా..

టైలర్, రజక, నాయిబ్రాహ్మణ వృత్తి చేసుకునేవారికి షాపు అద్దెలు, విద్యుత్ బిల్లులకు సాయంగా చేదోడు పథకం అమలు చేశారు. ఏడాదికి రూ.10 వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.40 వేల లబ్ధి చేకూర్చారు. జిల్లాలో 2020–21లో 10,007 మందికి రూ.10 కోట్లు, 2021–2022లో 9,056 మందికి రూ.9.05 కోట్లు, 2022–2023లో 10,348 మందికి రూ.10.34 కోట్లు, 2023–2024లో 9,698 మందికి రూ.9.69 కోట్ల లబ్ధి చేకూర్చారు. మొత్తంగా 29,102 మందికి రూ.29.10 కోట్ల సాయం అందించారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవశకం పథకాలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
కాపునేస్తం	1,12,017	168.00
చేయూత	1,95,728	366.47
చేదోడు	29,102	29.10
ఈబీసీ నేస్తం	25,457	38.18
ఇంటికే రేషన్	239	
	వాహనాలు	13.50
మొత్తం		615.25

అగ్రవర్ణాలను ఆదుకున్న ఈబీసీ నేస్తం

అగ్రవర్ణాల్లోని పేద మహిళలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల చొప్పున రెండు విడతల్లో రూ.30 వేలు అందించారు. మూడో విడత సాయం అందించేలోపు ఎన్నికల కోడ్ అడ్డువచ్చింది. జిల్లాలో 2021–2022లో 11,997 మందికి రూ.17.99 కోట్లు, 2022–23లో 13,460 మందికి రూ.20.19 కోట్లు అందజేశారు. మొత్తంగా 25,457 మందికి రూ.38.18 కోట్ల లబ్ధి చేకూర్చారు.

ఇంటికే రేషన్‌తో ఉపాధి

రేషన్ దుకాణాలకు వెళ్లి నిత్యావసరాల తెచ్చుకోవడంలో ఇబ్బందులను గుర్తించిన గత ప్రభుత్వం ఇంటికే రేషన్ విధానాన్ని అమలు చేసింది. రేషన్ వాహనాల ఏర్పాటు ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి కల్పించింది. రూ.5.81 లక్షల విలువైన వాహనాన్ని రాయితీపై అందించింది. జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 239 వాహనాలకు రూ.13.50 కోట్లు ఖర్చు చేసింది. ఈ వాహనాలను ఇటీవల విజయవాడ వరద బాధితులకు సహాయ కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం ఉపయోగించుకుంది.

ఎమ్మెల్యే అవినీతికి అంతే లేదు

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజాప్రతినిధిగా ఉన్న మీరు సభ్యత, సంస్కారంతో మాట్లాడటం నేర్చుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్థానిక శాసనసభ్యునికి హితవు పలికారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే చేసిన విమర్శలపై ఆదివారం కొట్టు నివాసంలో విలేకరుల సమావేశంలో సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉండగా ఆయన చేసిన అవినీతికి అంతమే లేదని విమర్శించారు. అప్పటి జెడ్పీ చైర్మన్‌తో కుమ్మక్కై జెడ్పీ హైస్కూల్ స్థలంలో 11 దుకాణాలు నిర్మించి ఒక్కోటి రూ.60 లక్షలకు అమ్ముకునేందుకు ప్రయత్నించగా పట్టణ ప్రముఖులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారని విమర్శించారు. అలాగే ఆ సమయంలో నాన్ లేఅవుట్లలో వాటాలు పుచ్చుకున్నారని, ఎల్ఈడీ దీపాల పేరుతో కోట్ల రూపాయలు దండుకున్నారని, మాస్టర్ ప్లాన్ మార్పి అనుమతులిచ్చినందుకు రూ.2 కోట్లు తీసుకున్నట్టు ప్రజలే చెబుతున్నారని ఆరోపించారు. స్థానిక శారదా గ్రంథాలయం స్థలం విక్రయం విషయంపై గతంలో హైకోర్టులో కేసు వేశారని.. ప్రస్తుతం ఆ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

పేదల బియ్యాన్ని అమ్ముకుని..

పట్టణంలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో అక్రమంగా నిర్మించిన షాపులను మున్సిపల్ అధికారులు గతంలో తొలగించగా.. వాటిని తిరిగి నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే ఇప్పుడు ఎందుకు అడ్డుకోవడం లేదని కొట్టు నిలదీశారు. గతంలో తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్యే కుమారుడు నాలుగు లారీల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముకున్నారని, దీనిపై పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైందన్నారు.

ఒక్కరోడ్డూ వేయలేదు

కూటమి పాలనలో పట్టణంలో ఒక్కరోడ్డు కూడా వేయలేకపోయారని.. అయినా ఎమ్మెల్యే మాత్రం మూడుసార్లు గుంతలు పూడ్చామని చెబుతున్నారని కొట్టు ఎద్దేవా చేశారు. అలాగే పట్టణంలోని వీకర్స్‌కాలనీలో నాలుగు నెలల్లో నాలుగు హత్యలు జరిగాయని, వీటిపై ఎమ్మెల్యే స్పందించకపోవడం శోచనీయమన్నారు. గతంలో ఆయన మున్సిపల్ చైర్మన్‌గా ఉండగా పట్టణ అభివృద్ధికి తూట్లు పొడిచారని, అప్పటి శాసనసభ్యుడితో విభేదించి పనులను అడ్డుకున్నారని విమర్శించారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డాం

తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి తాను పాటుపడ్డానని కొట్టు అన్నారు. రూ.1,100 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల పనులు ప్రారంభించామన్నారు. చిలకంపాడు నుంచి వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ వర్సిటీ వరకు రూ.45 కోట్లతో, నవాబుపాలెం నుంచి నిడదవోలు వైపు రూ.10 కోట్లతో రోడ్లు వేశామన్నారు. నవాబుపాలెం నుంచి త్యాజంపూడి వరకు రూ.32 కోట్లతో పనులకు టెండర్లు పిలిచామన్నారు. సమావేశంలో నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, బంగారు నాగు, కొలుకులూరి ధర్మరాజు, వెలిశెట్టి నరేంద్ర, గుండుమోగుల సాంబయ్య, బొద్దాని శ్రీను, మానుకొండ వెంకటేశ్వరరావు, బోణం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులు





భక్తులతో కిక్కిరిసిన అనివేటి మండపం, కోలాట నృత్య ప్రదర్శనలు

క్షేత్రంలో కార్తీక కోలాహలం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో కార్తీక మాస సందడి నెలకొంది. ఆదివారం క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అలాగే పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు తరలివచ్చారు. భక్తులు దీపారాధన మండప ప్రాంతంలోని చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయంలో అన్ని విభాగాలూ రద్దీగా కనిపించాయి. అనివేటి మండపంలో భజన మండలి సభ్యుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

– ద్వారకాతిరుమల

సైబర్ మోసం.. జర భద్రం

- డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలు
- లింకులు పంపి ఖాతాలను ఖాళీ చేస్తున్న నేరగాళ్లు
- సరికొత్త పద్ధతుల్లో నేరాలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



- నూజివీడు పట్టణానికి చెందిన మండవల్లి కమలా ఏసుదాసుకు అక్టోబర్ 3న ముంబై పోలీసులం ఫోన్ చేస్తున్నామంటూ.. మీ పేరుపై పార్సిల్ వచ్చిందని, అందులో నిషేధిత డ్రగ్స్ వచ్చాయని, రూ.40 లక్షలు తాము చెప్పిన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తే విచారణ అనంతరం నిర్దోషి అని తేలితే తిరిగి ఇచ్చేస్తామని వీడియో కాల్‌లో బెదిరించారు. దీంతో భయపడిన కమలా ఏసుదాసు వారు చెప్పిన ఖాతాకు రూ.40 లక్షలు బదిలీ చేసి తాను మోసపోయినట్టు గుర్తించారు.
- నూజివీడు మండలం యనమదలకు చెందిన వరికూటి ప్రసాద్ ఫోన్‌కు ఆగస్టులో పీఎం కిసాన్ ఏపీకే లింక్ వచ్చింది. తెలియక దానిని నొక్కితే సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను హ్యాక్ చేసి అతడి ఖాతాలోని రూ.1.30 లక్షలను మాయం చేశారు.
- నూజివీడుకి చెందిన దొండపాటి గోపాల్ ఫోన్‌కు సెప్టెంబర్‌లో ఏపీకే ఫైల్ రాగా దానిని అతడి భార్య ఓపెన్ చేసింది. దీంతో సైబర్ నేరగాళ్లు అతడి ఖాతాలోని రూ.3 లక్షలను దోచుకున్నారు.
- భీమవరానికి చెందిన ఓ వైద్యుడికి గత నెలలో ముంబై నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ పేరున పార్సిల్ వచ్చిందని, అందులో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని విచారణ జరుపుతున్నందున మీ ఖాతాలో ఉన్న రూ.72 లక్షలను మరో ఖాతాకు బదిలీ చేయాలని భయపెట్టారు. విచారణ పూర్తయిన తర్వాత మీ అకౌంట్‌కు జమ చేస్తామని చెప్పడంతో నేరగాళ్లు చెప్పిన ఖాతాకు వైద్యుడు నగదు బదిలీ చేసి మోసపోయారు.

ఇలా.. ఇటీవల కాలంలో లింకుల ద్వారా, డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలు చోటుచేసుకుంటున్నాయి. బాధితుల నుంచి లక్షలాది రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారు. పోలీసులను ఆశ్రయిస్తున్నా బాధితులకు న్యాయం జరగడం లేదు.

నూజివీడు: బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు ఉంటే సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ఏపీకే ఫైల్ పంపడం, వీడియోకాల్ చేసి పోలీస్ డ్రెస్‌లో మాట్లాడుతూ భయపెడుతున్నారు. వారి మాటలు నమ్మి మోసపోతున్న వారిలో ఎక్కువ మంది చదువుకున్న వారే ఉండటం గమనార్హం.

రోజురోజుకూ సైబర్ నేరాలు కొంత పుంతలు తొక్కుతున్నాయి. ఏ రూపంలో నేరాలు జరుగుతాయో అంతుబట్టడం లేదు. పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, వాట్సాప్ గ్రూపుల్లో సైబర్ నేరాల గురించి పోస్టులు పెట్టి చైతన్యం కలిగిస్తున్నా నేరాలు మాత్రం ఆగడం లేదు. అలాగే పోలీసులు ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దంటూ నేరగాళ్లు అనుసరిస్తున్న విధానాలపై ప్రచారం చేస్తున్నారు. సైబర్ మోసాల బారినపడి మోసపోయినా బయటకు రాని వారు చాలా మంది ఉంటున్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఫోన్‌లో ఎవరేమి అడిగినా చెప్పొద్దు



ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఫోన్‌లో ఎవరేమి అడిగినా చెప్పొద్దు. అధిక డబ్బు ఇస్తామన్నా నమ్మొద్దు. డిజిటల్ అరెస్టు పేరుతో ఏం చెప్పినా పట్టించుకోవద్దు. ఓటీపీలు కూడా ఎవరికి చెప్పొద్దు, షేర్ చేయొద్దు. అప్పుడే సైబర్ నేరాలను నియంత్రించగలుగుతాం.

– పి.సత్య శ్రీనివాస్, సీఐ నూజివీడు టౌన్

దొడ్డిపట్లలో అదృశ్యం.. ఏలూరులో ప్రత్యక్షం



బాలుడిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామంలో ఆడుకుంటూ ఓ బాలుడు (12) అదృశ్యమయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన బాలుడు దీపావళికి నానమ్మ ఊరు దొడ్డిపట్ల వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం కొందరు పిల్లలతో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు సాయంత్రం వరకూ గాలించినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం 7 గంటలకు పోలీసులను ఆశ్రయించగా కొద్ది సమయంలోనే బాలుడి ఆచూకీని కనిపెట్టారు. బాలుడి అమ్మమ్మ ఊరు ఏలూరు కావడంతో ఇక్కడి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు ఆదేశాలతో ఎస్సైలు ప్రసాద్, రాంబాబు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 8.30 గంటల సమయంలో బాలుడి ఆచూకీ గుర్తించారు. హైదరాబాద్‌లో చదవడం తనకు ఇష్టం లేదని, విజయవాడలో చదువుకుంటానంటే పెద్దలు పట్టించుకోవడం లేదని, దీంతో ఇల్లు వదిలి బయటకు వచ్చానని బాలుడు పోలీసులకు చెప్పాడు. పోలీసులు బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.

దేవాంగులకు కూటమి ప్రభుత్వం అన్యాయం

నరసాపురం : చట్టసభల్లో ప్రాతినిధ్యం, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వడంలో దేవాంగులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని టీడీపీ నేత, దేవాంగ యూత్ జిల్లా అధ్యక్షుడు మావూరి ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత జనాభాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న దేవాంగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో న్యాయమూర్తి హరినాథ్


న్యాయమూర్తి హరినాథ్ గుప్తాకు శ్రీవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారి

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ కోర్టు న్యాయమూర్తి హరినాథ్ గుప్తా ఆదివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు.

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు


గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: కార్తీక మాసం మొదటి ఆదివారం గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి మంగమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చారని ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచార యత్నం

ఉండి: ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచార యత్నం ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం పాందువ్వ కొత్త కాలనీలో వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన కాసుమళ్ళ రమేష్ శనివారం అర్ధరాత్రి ఇంట్లోకి అక్రమంగా చొరబడి వృద్ధురాలి వద్ద ఉన్న రూ.4 వేలు లాక్కుని ఆమెను కొట్టి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


ప్రశాంత్‌కుమార్, మృతుడు

ఏలూరు టౌన్: భువనేశ్వర్ నుంచి చెన్నై వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆదివాసీ ప్రశాంత్‌కుమార్ బుయ్(26) తన భార్య రష్మితతో కలిసి శనివారం భువనేశ్వర్ నుంచి చెన్నై వెళ్ళే రైలు జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్నాడు. రైలు భీమడోలు రైల్వే గేటు సమీపంలోకి వచ్చే సరికి ప్రమాదవశాత్తు ప్రశాంత్‌కుమార్ రైలునుంచి జారిపడ్డాడు. సంఘటన స్థలంలోనే అతను మృతిచెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీలో భద్రపరిచారు.

తీరంలో మద్యం ఏరులు

- 'వేలం'వెర్రిగా బెల్ట్‌షాపులు
- హైవే పక్కనే ఏర్పాటు..
  చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు



జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

నరసాపురం: నరసాపురం ప్రాంతంలో మద్యం ఏరులై పారుతోంది. తీర గ్రామాల్లో అడుగడుగునా మద్యం ఏరులై పారేలా మద్యం సిండికేట్లు రెచ్చిపోతున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల ఏర్పాటుకు బహిరంగ వేలం పాటలు పెడుతున్నారు. రికార్డు ధరలకు షాపులను కూటమి నేతలు, కార్యకర్తలు దక్కించుకుంటున్నారు. మరోవైపు హైవే పక్కనే ఇష్టారాజ్యంగా మద్యం షాపులు ఏర్పాటు చేసి జనాన్ని మత్తులో ముంచుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు నోరు మెదపకుండా మిన్నకుండిపోతున్నారు. మామూళ్ల మత్తు, మరోవైపు కూటమి నేతల బెదిరింపులతో ఎక్సైజ్ అధికారులు మౌనంగా ఉంటున్నారు.

ఒక్కో పంచాయతీకి 4 బెల్ట్‌షాపులు

నరసాపురం పట్టణంలో 31 వార్డులున్నాయి. పట్టణంలో 5 బ్రాందీషాపులు ఏర్పాటు చేశారు. నరసాపురం రూరల్ మండలంలో 28 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ మండలంలో 9 మద్యం షాపులు ఏర్పాటు చేశారు. 17 పంచాయతీలున్న మొగల్తూరు మండలంలో 5 మద్యం షాపులు తెరిచారు. 19 కిలోమీటర్లు తీరప్రాంతమున్న నరసాపురం మండలంలో దాదాపు 15 వరకూ తీరగ్రామాలున్నాయి. రోజంతా కష్టపడే మత్స్యకారులు, కూలీలు ఈ గ్రామాల్లో నివసిస్తున్నారు. ఉదయమంతా కష్టపడి రాత్రికి ఇళ్లకు చేరుకుంటారు. మద్యం సిండికేట్ల కన్ను తీరగ్రామాలపై పడింది. తీరప్రాంత గ్రామాల్లో అడుగడుగునా మద్యం దొరికేలా వ్యూహ రచన చేశారు. ఒక్కో పంచాయతీలో నాలుగు చొప్పున బెల్ట్ షాపులు పెట్టాలని నిర్ణయించారు. మద్యం షాపులు మొత్తం కూటమి నేతలే దక్కించుకున్నారు. బెల్ట్ షాపుల కోసం కూటమి నేతలు ఎగబడుతున్నారు. పోటీ ఎక్కువగా ఉండడంతో వేలం పాటలు నిర్వహిస్తున్నారు.

కళ్లు చెదిరే ధరలకు బెల్ట్‌షాపులు

నరసాపురం మండలం చినమైనవానిలంకలో బెల్ట్ షాపు ఏర్పాటుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఏడాదికి ఆ పరిధిలోని బ్రాందీషాపు లైసెన్స్ దారుడి ద్వారా మద్యం సిండికేట్‌కు రూ.2.20 లక్షలు చెల్లించేలా వేలం పాట వెళ్లింది. ఇది జరిగిన వారం రోజులకు పక్కనున్న మరో తీరగ్రామం పెదమైనవానిలంకలో బెల్ట్‌షాపునకు వేలంపాట పెట్టగా ఏకంగా ఏడాదికి రూ 17.80 లక్షలు చెల్లించేలా మరో వ్యక్తి పాడుకోవడం చర్చనీయాంశమైంది. మిగిలిన గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడానికి సిండికేట్లు పావులు కదుపుతున్నారు. స్థానిక కూటమి నేతల వెన్నుదన్నులతో ప్రతీ పంచాయతీలో కనీసం నాలుగు బెల్ట్‌షాపులుండేలా ప్రణాళిక అమల్లో పెడుతున్నారని సమాచారం.

నిబంధనలకు తూట్లు

పట్టణంలో కూటమికి చెందిన ఓ చోటా నేత మొగల్తూరు రోడ్డులో జాతీయరహదారి పక్కన రాత్రికి రాత్రి షాపు కట్టి మద్యం షాపు ఏర్పాటు చేశాడు. సీతారామపురంలో జాతీయ రహదారికి దగ్గరగా షాపు ఏర్పాటు చేశారు. స్థానికులు వ్యతిరేకించినా ప్రయోజనం లేకపోయింది. గత టీడీపీ హయాంలో కూడా ఇళ్ల మధ్య బ్రాందీ షాపు వద్దంటూ స్థానికులు అందోళనలు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నారు. పట్టణంలో జాతీయరహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థ పక్కనే షాపు ఏర్పాటు చేసే ప్రయత్నం చస్తశారు. విద్యార్థులు ఆందోళన బాట పట్టడంతో వెనక్కి తగ్గారు. పేదలు, రోజువారీ కూలీలు అత్యధికంగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం అందుబాటులో ఉంచేందుకు మద్యం సిండికేట్లు స్థానికంగా ఉండే తమ నేతల ఇళ్లలోనే బెల్ట్‌షాపు పెట్టి పంతం నెగ్గించుకోవాలని చూస్తున్నారు. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో తీరగ్రామాల్లో బెల్ట్‌షాపు అనే పదం కూడా వినిపించకుండా చేశారు. ఇప్పుడు మద్యం ఏరులై పారుతోంది.

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం


సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెంలో శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాసోత్సవాలు ఆదివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా అర్చకులు, పండితులు సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. యర్నగూడెంకు చెందిన శ్రీలలిత పరమేశ్వరీ భజన మండలి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. రూ.1,36,544 ఆదాయం వచ్చినట్లు, 2,000 మంది భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

మద్దిలో నేడు:

ఈ నెల 4 సోమవారం ఆలయ 31 వార్షిక సప్తాహ మహోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ చందన తెలిపారు. 11 వరకు సప్తాహాలు జరుగుతాయన్నారు.

ఉచిత ఇసుకలో దళారుల రాజ్యం

- ఎర్రకాలువ, జల్లేరులో
  ట్రాక్టర్లతో ఇసుక తవ్వకాలు
- బిల్డర్స్‌కు రూ.3 వేల నుంచి
  రూ.4 వేలకు విక్రయం


గురవాయిగూడెం ఎర్రకాలువ వంతెన వద్ద ట్రాక్టర్లతో ఇసుక తీసుకెళ్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఎండ్లబండి, ట్రాక్టర్‌తో ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చన్న ప్రకటన దళారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఏలూరు జిల్లాలో ఎర్రకాలువ, జల్లేరు, బైనేరు వాగులు మెట్ట ప్రాంతాల మీదుగా ప్రవహిస్తాయి. ఉచిత ఇసుక విధానంతో ఈ వాగుల నుంచి ట్రాక్టర్లపై ఇసుక తరలిపోతోంది. పేరుకే ఉచిత ఇసుక అయినప్పటికీ ప్రజల వద్దకు వచ్చే సరికి ఖరీదు వ్యవహారంలా మారుతోంది. జంగారెడ్డిగూడెం మండలం మీదుగా ప్రవహించే ఎర్రకాలువ, జల్లేరు, బైనేరు వాగుల్లో నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నారు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కెకెఎం ఎర్రకాలువ జలాశయం నుంచి ప్రారంభమైన ఎర్రకాలువ ప్రధాన వాగు సుమారు 40 కిలోమీటర్లలో ఉన్న అనంతపల్లి వరకు వెళ్తుంది. అక్కడ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తుంది. వాగు వెంట ఎక్కడి పడితే అక్కడ నిబంధనలు పాటించకుండా తవ్వకాలు చేసేస్తున్నారు.

ఎర్రకాలువ వంతెన వద్ద తవ్వకాలు

వంతెనల వద్ద ఇసుక తవ్వకాలు చేయడం నిషేధం. అయితే ఇసుక తరలించుకోవచ్చని కూటమి ప్రభుత్వం ప్రకటనతో జిల్లాలో మధ్య తరహా ప్రాజెక్టుగా పేరున్న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం ఎర్రకాలువ వంతెన వద్ద ట్రాక్టర్లతో ఇసుక తవ్వేస్తున్నారు. ఇప్పటికే ప్రజా సంఘాలు వంతెన వద్ద ఇసుక తవ్వకాలు చేయడంతో ప్రమాద పొంచి ఉందని దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నా చర్యలు మాత్రం శూన్యం

దళారులకు కాసుల వర్షం

ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని కూటమి ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి దొరికిందే చాన్స్ అంటూ దళారులు తమ ట్రాక్టర్లతో ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ ఇసుకను తోడేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. ఇసుకను అంతధరకు కొనుగోలు చేయలేని నిరుపేదలు ఇదేక్కడి ఉచిత ఇసుక విధానం రా బాబూ.. అంటూ లబోదిబోమంటున్నారు.

గందరగోళంగా ఇసుక విధానం

గృహ నిర్మాణాలు చేసుకునే లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఎండ్లబండ్లు ఉండవు. ట్రాక్టర్లను అద్దెకు మాట్లాడుకుని కూలీలకు డబ్బులు చెల్లించి వాగుల్లోకి వెళ్లి ఇసుకను తెచ్చుకోవడం సాధ్యం కాని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో రూ. 3 వేలకు ఇసుకను కొనుగోలు చేయక తప్పని పరిస్థితి.

పేదలకు ఉచిత ఇసుక దూరం



ఇల్లు నిర్మించుకోవాలనుకునే నిరుపేదలకు ఉచిత ఇసుక అందడం లేదు. ప్రస్తుతం వాగుల్లో, కాలువల్లో తవ్వుతున్న ఇసుక రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అందుతుంది. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు ఇసుకను దళారులు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉచిత ఇసుక నిరుపేదల ఇళ్లకు ఉపయోగానికి అందేలా సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణలో అమలు చేస్తే ఈ పథకానికి ఒక విలువ ఉంటుంది.

– కోట వెంకటేశ్వరరావు– సర్పంచ్– పంగిడిగూడెం

పాఠశాల విద్యా రంగాన్ని కాపాడుకోవాలి


యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు ఏలూరు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని డీసీఎంఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం ఉపాధ్యాయులందరి బాధ్యత అని, కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు విద్యారంగాన్ని పక్కదారి పట్టిస్తున్నాయని దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభ సమావేశం, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్యాంబాబు అధ్యక్షతన విద్యా సదస్సు, యుటీఎఫ్ అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ మాట్లాడుతూ 117 జీవోని రద్దు చేస్తానని మాట ఇచ్చిన కొత్త ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపి మూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు ఎన్.కుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, పశ్చిమగోదావరి జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి డీఎన్వీడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక


ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీలత

కైకలూరు: జమ్ము కాశ్మీర్‌లో ఈ నెల 6న జరిగే ఇంటర్ యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీలకు కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి ఆరుగురు విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత ఆదివారం చెప్పారు. క్రీడాకారులు పి.కమిలిని, కె.షారోన్ రోజా, పి.మీనాక్షి, జి.రత్నశేఖర్, ఎన్.యశ్వంత్, జి.దినేష్, కె.శివచందును అభినందించారు.

అండర్–13 బాలికల చెస్ పోటీలు ప్రారంభం


చెస్ పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: అండర్–13 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ చాంపియన్ షిప్ పోటీలను భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో ఆదివారం డీఎస్పీ జయసూర్య ప్రారంభించారు. చదరంగంలో శిక్షణ ద్వారా మేధాశక్తితో ఉన్నత విద్యలో రాణించడానికి తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందిస్తున్న అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి అరసవల్లి మణికంఠ వెంకటేష్, ఆర్యవైశ్య యువజన సంఘంను అభినందించారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ గెలుపొందిన విద్యార్థులు నవంబర్ 19 నుంచి 21 వరకు తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చదరంగం ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, కార్యదర్శి గమిని రవి పవన్ కుమార్, వన్ టౌన్ సీఐ నాగరాజు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ సెమీస్‌కు ఉమ్మడి పశ్చిమ జట్టు

ఏలూరు రూరల్: పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు సెమీఫైనల్‌కు చేరిందని అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం అండర్–14 బాలికల క్వార్టర్‌ఫైనల్‌లో అద్భుత ప్రతిభ చాటి గుంటూరుపై 26–13 స్కోర్‌తో విజయం సాధించారన్నారు.

దుర్గారావు హత్యపై వీడని అనుమానాలు


మృతుడు కాకర్ల దుర్గారావు (ఫైల్)

తణుకు: తణుకు పట్టణంలో సంచలనం రేకెత్తించిన హత్య కేసులో ఎలాంటి పురోగతి లేదు. ఈ నెల 1న పట్టణానికి చెందిన కాకర్ల దుర్గారావు తణుకు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హత్యకు గురయ్యాడు. ఈ హత్యోదంతంపై తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పట్టణంలోని నడిబొడ్డున పాఠశాల ఆవరణలో జరిగిన ఈ హత్య స్థానికంగా సంచలనం రేకెత్తించగా పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దుర్గారావు హత్యకు సంబంధించి స్థానిక టీడీపీ నేత ప్రమేయం ఉన్నట్లు సోషల్ మీడియాలోని లేఖ చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ హత్యపై మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పందిస్తూ దళిత వర్గానికి చెందిన దుర్గారావు హత్యకు సంబంధించి టీడీపీ నేత ప్రమేయంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ దుర్గారావు మృతిని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.

టీడీపీ నేత పాత్రపై విచారించాలి: మాజీ మంత్రి కారుమూరి

మూడ్రోజులైనా దొరకని క్లూ

దుర్గారావు హత్య జరిగి మూడ్రోజులైనా ఎలాంటి క్లూ లభించలేదు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే హత్య జరగడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. దీపావళి రోజు గురువారం రాత్రి 10 గంటల వరకు వ్యాపారులు, పోలీసు సిబ్బంది సైతం పాఠశాల ఆవరణలోనే సంచరించారు. అర్ధరాత్రి దాటాక ఈ హత్య జరిగినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ఇంటింటికీ గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేస్తూ జీవించే దుర్గారావుకు స్థానికంగా సౌమ్యుడి పేరుంది. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో చెత్త తొలగించడానికి దుర్గారావును కోరగా డబ్బులు అడిగాడని... నీకెందుకు డబ్బులు ఇవ్వాలంటూ అతనిపై కొందరు దాడి చేశారని... దాడి చేసిన వ్యక్తుల వెనుక టీడీపీ నేత హస్తం ఉందని సోషల్ మీడియాలోని లేఖ సారాంశం కాగా ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు లభించడం లేదని తెలుస్తోంది. దుర్గారావు రోజూ మద్యం సేవిస్తూ ఎక్కడ పడితే అక్కడ నిద్రిస్తూ ఉంటాడని తోటి సిబ్బంది చెబుతున్నారు. దుర్గారావుతో మద్యం తాగే కొందరు వ్యక్తులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. మృతి చెందిన తీరు చూస్తే ముఖంపైనా తలపైనా బలమైన గాయాలున్నాయి. నలుగురైదుగురు దుర్గారావుపై దాడి చేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. పట్టణ సీఐ ఎన్.కొండయ్యను వివరణ కోరగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. టీడీపీ నేత పాత్రపై వస్తున్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని ఆ దిశగా విచారణ చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పతకాలు

నెల్లూరు(టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ – 14, 17 విభాగాల్లో నెల్లూరులోని దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన 68వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ -2024 పోటీలు ఆదివారం ముగిశాయి. అండర్ – 17 బాలికల విభాగం ఆర్టిస్టిక్‌లో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎంజీ పావని ప్రథమ స్థానం దక్కించుకుంది. ట్రెడిషనల్‌లో పశ్చిమ గోదావరికి చెందిన ఐ.అమిత ప్రథమ, తస్లీమ్ తృతీయ స్థానం దక్కించుకున్నారు.

ఎర్రకాలువలో మునిగి యువకుడి మృతి


మృతి చెందిన రాజ్‌కుమార్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోకి కెకెఎం ఎర్రకాలువ జలాశయంలోకి స్నానానికి దిగిన ఒక యువకుడు మృతి చెందాడు. లక్కవరం ఏఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన 15 మంది ఆదివారం బొలేరో వాహనంలో బుట్టాయిగూడెం మండలంలో ఉన్న శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి క్షేత్రానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం వద్దకు వచ్చారు. కంకిపూడి రాజ్‌కుమార్ (22) తో పాటు మరొకరు జలాశయంలోకి స్నానానికి దిగారు. రాజ్‌కుమార్ స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. లక్కవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి రాజ్‌కుమార్ మృతదేహాన్ని వెలికితీశారు.

● కళకళలాడిన బీచ్‌లు


బీచ్‌లో సేదదీరుతున్న సందర్శకులు


బీచ్‌లో పోలీస్ సిబ్బంది బందోబస్తు

మొగల్తూరు: కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లకు భారీగా తరలివచ్చారు. దీంతో వివిధ శాఖల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి ఆదివారం సుమారు 5 వేల మంది బీచ్‌ను సందర్శించారని అంచనా వేస్తున్నారు. ఆర్‌డీఓ దాసి రాజు బీచ్‌ను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. డీఎస్పీ ఎంబీఎస్ మురళీకృష్ణ పర్యవేక్షణలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్సైలు గుర్రయ్య, సురేంద్ర, సురేష్ బాబు, ముత్యాలరావు, జి.వాసుతో పాటు 90 మంది సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు


అయిభీమవరంలో ఇంటింటికీ వెళ్లి ఆరా తీస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ మహేశ్వరరావు

సాక్షి ఎఫెక్ట్

ఆకివీడు: 'అయిభీమవరంలో జ్వరాలు' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించి డీఎంహెచ్ఓ మహేశ్వరరావు స్పందించి ఆదివారం హుటాహుటిన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక దళిత పేటలోని కొన్ని ఇళ్లకు వెళ్ళి బాధితుల్ని కలిశారు. గ్రామంలోని దళిత పేటలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్థానిక వైద్య సిబ్బంది సర్వే సక్రమంగా చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జ్వరాలు తగ్గేంత వరకూ గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. మంచినీటిని పరీక్షలు చేయించాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో శానిటేషన్‌కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్ గాలి సామ్రాజ్యంతో మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్ పెంచాలని సూచించారు.

సమస్యల వలయంలో మహాలక్ష్మీనగర్ కాలనీ

- ప్రధానంగా తాగునీటి కోసం ఇక్కట్లు
- ఖాళీ స్థలాల్లో తాండవిస్తున్న అపరిశుభ్రత
- రోడ్లకు సమాంతరంగా కచ్చా డ్రెయిన్లు


ఖాళీ స్థలంలో వ్యర్థాలు, తూడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మహాలక్ష్మీనగర్ కాలనీ ప్రజలు పలు రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయల కొరత వేధిస్తోంది. ప్రధానంగా తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. పైపులైన్ల లీకుల వల్ల కుళాయిల నుంచి మురికి నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మీనగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 4 వరకూ ప్రధాన వీధులు, ఇతర అంతర్గత రహదారులు ఉన్నాయి. వార్డులో అపరిశుభ్ర పరిస్థితులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలతో వెతలు

వార్డులో ఖాళీ స్థలాలు ఉండటంతో వాటిల్లోకి వర్షపు నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. రహదారులు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రాత్రి వేళ వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. వార్డులోని ఖాళీ స్థలాల్లో డ్రెయినేజీ, మురుగు నీరు, వర్షపు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఖాళీ స్థలాలు దోమలకు, పందులకు, విష సర్పాలకు నిలయాలుగా ఉంటున్నాయి.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఎక్కడ మురుగు అక్కడే ఉంటోంది. ఎత్తు, పల్లాలు కారణంగా డ్రెయిన్‌లో మురుగు పారుదల సక్రమంగా లేదు. డ్రెయినేజీలను నిర్మించి సక్రమంగా పారుదల జరిగే విధంగా చూడాలని కోరుతున్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలపై కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.

రోడ్లు, డ్రెయినేజీలు సమాంతరం

అనేక ప్రాంతాల్లో ఇంకా కచ్చా డ్రెయినేజీలే ఉండటంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు సమాంతరంగా ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు డ్రెయిన్ నుంచి మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో ఆయా ప్రాంతాలు మునిగిపోతున్నాయి. ఎక్కడ చెత్త అక్కడే ఉంటోంది. ఇంటింటికీ చెత్త సేకరించే వాహనాలు ఆగిపోవడంతో పుష్ కార్టులు, ట్రాక్టర్లతో చెత్త తరలిస్తున్నారు. పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి లైట్ల మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మహాలక్ష్మీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మట్టి అంతర్గత రహదారులు

పలు అంతర్గత రహదారులు సీసీ రహదారులుగా నిర్మించినప్పటికీ ఇంకా అనేక రహదారులు కంకర, మట్టిరోడ్లుగానే ఉన్నాయి. మట్టి రోడ్లు, కంకర రోడ్లు ఎగుడు, దిగుడులతో మారడంతో పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలం వస్తే రోడ్లు మునిగిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఆక్రమణల కారణంగా రోడ్లు కుచించుకుపోయాయి.

అపరిశుభ్ర పరిస్థితులు తొలగించండి



మహాలక్ష్మీనగర్ పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. డ్రెయినేజీ నీటి పారుదల సక్రమంగా జరిగే విధంగా చూడాలి. మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించాలి. ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేసే విధంగా చూడాలి. దోమల బెడద నుంచి వార్డు ప్రజలను కాపాడాలి. కుక్కలు, పందులు, విష సర్పాలు, జంతువుల బారి నుంచి రక్షించాలి. – సీహెచ్ ప్రసాద్, తాడేపల్లిగూడెం




అంతర్గత మార్గంలో కల్వర్టు లేకపోవడంతో ఏర్పాటు చేసిన డ్రెయిన్ | మట్టి రోడ్డు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయిన్ | మహాలక్ష్మీ నగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న ఖాళీ స్థలం

రాజ్యాంగ పీఠిక పఠనం- ప్రతిజ్ఞపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న సంకు మనోరమ

తణుకు: విద్యాసంస్థల్లో విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించి వాటిలో పదాల ప్రాముఖ్యతను అధ్యాపకులు తప్పనిసరిగా వివరించాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ పేర్కొన్నారు. ఆదివారం తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో భావి భారత పౌరులకు రాజ్యాంగ పీఠిక పఠనం-ప్రతిజ్ఞ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రచార వేదిక సమన్వ కర్త డీవీవీఎస్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మనోరమ మాట్లాడుతూ భారత రాజ్యాంగం- విద్యార్థుల కోసం రాసిన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక హక్కులు అనే అంశంపై సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీకుమార్, ప్రాథమిక విధులు అనే అంశంపై శ్రీశ్రీ సేవా సమితి కన్వీనర్ పి.దక్షిణామూర్తి, ఆదేశిక సూత్రాలు అనే అంశంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు విష్ణువర్ధన్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో తణుకు స్టడీ సర్కిల్ కార్యదర్శి డాక్టర్ రమేష్‌చంద్రబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుబ్బల తమ్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా కాళీమాత ఊరేగింపు


తాడేపల్లిగూడెంలో కాళీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణ పురవీధుల్లో ఆదివారం రాత్రి కాళీమాత ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన బెంగాలీ స్వర్ణకారులు, ఎంబ్రాయిడరీ కార్మికులు ఏటా దీపావళికి స్థానిక శేషమహల్ రోడ్డులోని జీకే జ్యూయలరీ సమీపంలో కాళీ మాత ఉత్సవాలను నిర్వహిస్తారు. తాడేపల్లిగూడెం బెంగాలీ సంస్కృత సంఘం ఆధ్వర్యంలో మూడ్రోజులుగా అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం రాత్రి ఊరేగింపు, నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగాలీ మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

మంత్రి దుర్గేష్‌కు వినతి


మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

తణుకు అర్బన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలుపరచాలని, ఉచిత ఇసుక విధానం అందరికీ అందుబాటులో ఉండే విధంగా సరళ తరం చేయాలని కోరుతూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం తణుకు జాతీయ రహదారిపై మంత్రిని కలిసిన నాయకులు ఈనెల 6న నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల అంశాలకు ప్రాధాన్యతనిచ్చేలా చర్చించాలని మంత్రిని కోరినట్లు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు బొల్లాడ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లుగా వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడే సాయి బాలాజీ, రాసాబత్తుల అనుకుమార్, తణుకు పట్టణ అధ్యక్షుడు కొక్కిరిమెట్టి సత్తిబాబు, తణుకు రూరల్ అధ్యక్షుడు సాసుమల్లి పాల్గునరావు పాల్గొన్నారు.

ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 12వ శాఖను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పలువురు అతిథులు ప్రారంభించారు. బ్యాంక్ చైర్మన్ జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయ శేఖర్, విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, అంబికా ప్రసాద్, ఎం.వెంకటరత్నం, వివిధ ప్రాంతాల నుంచి హాజరైన బ్యాంక్ చైర్మన్లు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మేడపాడులో లక్ష బిల్వార్చన

యలమంచిలి: కార్తీకమాసం మొదటి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మేడపాడు శ్రీఉమారామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో లక్ష బిల్వార్చన (లక్ష పత్రి పూజ) నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి తెలిపారు. వేదపండితులు బాదంపూడి చిరంజీవి శర్మను బ్రహ్మత్వంలో జరిగే ఈ పూజలో ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు కోరారు.

కళా వేదిక ప్రారంభం

భీమవరం: జిల్లాలోనే మొదటి స్థానం కలిగి సుమారు 1100 మంది విద్యార్థులకు ఉపయోగపడే కళా వేదిక నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో దివంగత చెరుకుపల్లి మురళీకృష్ణ జ్ఞాపకార్థం వారి భార్య చెరుకుపల్లి కృష్ణవేణి, కుమారుడు సంతోష్ కుమార్ సౌజన్యంతో నిర్మించబడిన కళా వేదికను ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో చెనమల్ల చంద్రశేఖర్, కొళ్ల నాగేశ్వరరావు, వారణాసి రాధాకృష్ణ, కె.విజయలక్ష్మి, వేలూరి హనుమ కిరణ్, వేలూరి సుబ్రహ్మణ్య శర్మ, చందూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వక్ఫ్ పరిరక్షణ సభకు తరలిన నాయకులు

నరసాపురం: విజయవాడలో నిర్వహించిన వక్ఫ్ పరిరక్షణ సభకు నరసాపురం నుంచి ఆదివారం ముస్లింలు భారీగా తరలివెళ్లారు. నరసాపురం అంజుమన్ సంఘం ఆధ్వర్యంలో 200 మంది వెళ్లారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బులిమస్తాన్, ఎండీ దావూద్‌ఖాన్, ఎండీ మౌలాలీఖాన్ నాయకత్వంలో బయలుదేరి వెళ్లారు. వక్ఫ్ బోర్డు ఆస్తులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న యాక్ట్‌ను రద్దు చేయాలన్నారు. ముస్లింల హక్కుల పరిరక్షణ విషయంలో కేంద్రప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

మాలలపై దాడులను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న పొట్ల సురేష్

తణుకు టౌన్: మాలలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు మాలలంతా ఐక్యంగా పోరాడాలని నియోజకవర్గ దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు పొట్ల సురేష్ కోరారు. ఆదివారం రాత్రి తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో కాకి రాముడు అధ్యక్షతన మండల మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్ల సురేష్ మాట్లాడుతూ మండపేట, తణుకు పట్టణాలలో జరిగిన హత్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఐక్య పోరాటాల కోసం పని చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు జి.మధు, నియోజకవర్గ నాయకులు కె.వెంకట్రావు, తణుకు మండల ఐక్యవేదిక కన్వీనర్ నక్కా రమేష్, కార్యదర్శిగా ఏసు సుబ్బారావులను నియమించినట్లు తెలిపారు.

పంచారామ యాత్ర ప్రారంభం


తణుకులో బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: కార్తీకమాసం సందర్భంగా ఆదివారం తణుకు డిపో నుంచి పంచారామాలకు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, పల్లెవెలుగు మూడు బస్సులు బయలుదేరినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. బయలుదేరిన బస్సులు సోమవారం అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శైవ క్షేత్రాలను దర్శించుకుని రాత్రికి తణుకు చేరుకుంటాయని వివరించారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్ర దర్శనానికి 36 మంది యాత్రికులు ఆదివారం రాత్రి ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి అరుణాచలం క్షేత్రానికి బస్సు నడుపుతున్నట్లు ఆయన వివరించారు.

సామాజిక సేవల్లో లయన్స్ ముందంజ


లయన్స్ క్లబ్ సభ్యులను సత్కరిస్తున్న ఇంటర్నేషనల్ గవర్నర్ బి.విజయ్‌కుమార్‌రాజు

పాలకొల్లు అర్బన్: సామాజిక సేవల్లో లయన్స్ ముందంజలో ఉంటుందని లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ బి.విజయ్‌కుమార్‌రాజు చెప్పారు. ఆదివారం లయన్స్ కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్ స్థాపించి 55 ఏళ్లు, అలాగే లయన్స్ కంటి ఆసుపత్రి ప్రారంభించి 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లయన్స్ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రిలో రూ.2.50 కోట్లతో ఆధునిక పరికరాలను విజయ్‌కుమార్‌రాజు ప్రారంభించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొని లయన్స్‌సభ్యుల సేవలను అభినందించారు. అలాగే గత 55ఏళ్లుగా లయన్స్ క్లబ్‌కి వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను సత్కరించారు. ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి), చిగురుపాటి వరప్రసాద్, డా.చంద్రశేఖర శెట్టి, డా.చినిమిల్లి సత్యనారాయణరావు, ఛాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా.జయభారత్‌రెడ్డి, కార్యదర్శి భానుప్రకాష్, కోశాధికారి టీవీఆర్ సురేష్, కొమ్ముల మురళీకృష్ణ, నందుల సీతారామారావు, ఎన్‌వీఎస్ పాపారావునాయుడు, కేవీ నరసింహం, గాదె జనార్ధనగుప్త, పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, దర్శి శ్రీనివాసరావు గుప్త, రేపాక ప్రవీణ్‌భాను తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో స్నానాల గది ఏర్పాటు


ఉల్లంపర్రులో రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నానాల గది

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రు శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద కార్తీకమాసం పురస్కరించుకుని మహిళలు తెల్లవారుజామున కాలువలో స్నానాలు చేసి దీపాలు వెలిగిస్తారు. మహిళలు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునే నిమిత్తం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్నానాల గదిని నిర్మించారు. రోటరీ సభ్యులు మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్ విరాళంతో ఏర్పాటు చేసిన స్నానాల గదిని ఆదివారం రోటరీక్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివా స్, భీమనాదం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా దేవాంగ సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధన

నరసాపురం: పట్టణంలో ఆదివారం శ్రీచౌడేశ్వరిదేవి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకులు బీరక ప్రసాద్, ఉట్టి నాగసైనం మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు మన సంస్కృతిలో భాగమన్నారు. దేవాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. దేవాంగులు సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ముందుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బల్ల రమేష్, కనకం ప్రసాద్, గోరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అధికారులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూరైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం అమ్మకాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరిమిల్లి చక్రధర రావు, సర్పంచ్ వి.కృష్ణవేణి, మాజీ సర్పంచ్‌లు పి.సోమసూర్యచంద్రరావు, వెంకటలక్ష్మి ఉప సర్పంచ్ గుణ్ణం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణంలోని పైడిపర్రు, వేల్పూరు, రేలంగి తదితర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని ఏడుగురు వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు ఆకెళ్ల సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్‌డీఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. దీంతో ఆరుగొలను, దండగర్ర, లింగారాయుడిగూడెం, కొత్తూరు, నవాబుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శంకరమఠంలో లక్షపత్రి పూజ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం సందర్భంగా శంకరమఠంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శంకర స్వామికి లక్ష పత్రి పూజలు, సర్వ మంగళ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప శరణుఘోషతో మారుమోగిన మార్టేరు


మార్టేరులో స్వామివారి ఆభరణాలను ఊరేగిస్తున్న అయ్యప్ప మాలధారులు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ పీఠం, సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి గణపతి హోమం, కలస పూజ, పడిపూజ,అనంతరం భజన కార్యక్రమాలు ఆదివారం మార్టేరులో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కాయలగౌతమ చంద్రశేఖర్ రెడ్డి 18వ పడి శబరిమల యాత్ర చేస్తున్న సందర్భంలో చంద్రశేఖర్ రెడ్డి, నీరజా దంపతులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురుస్వాములు అడబాల శ్రీనివాస్, మల్లిడి రామకృష్ణారెడ్డి, తమనంపూడి విజయ్ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీనివాసుల గోపాలచార్యులు 216 మంది కన్నె స్వాములతో గణపతి హోమం, కలస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భిక్షానంతరం స్వామి వారి ఆభరణాలతో గ్రామోత్సవం నిర్వహించి కాయల వెంకటరెడ్డి నివాసం నుంచి అయ్యప్ప స్వామి వారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లి ఆభరణాలను స్వామివారికి అలంకరించి, అనంతరం 216 మంది కన్యాసాములతో కలశపూజ పడిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత భీమవరానికి చెందిన ఉండవల్లి బాల బ్రదర్స్ భజన కార్యక్రమం నిర్వహించి అనంతరం, పడి హారతి, ఉంజల సేవ, హరివరాసనం ఘనంగా నిర్వహించారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి


సుంకరపాలెంలో సమావేశమైన సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు

యలమంచిలి: వచ్చే ఏడాది జనవరి 5న కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ సన్నాహకాలలో భాగంగా ఆదివారం సభ వివరాల కరపత్రాన్ని విడుదల చేశారు. గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు సమావేశమై ఈ సభ విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ ముత్యాల చంటి, యలమంచిలి మండల కార్యదర్శి దివి ప్రకాష్, అర్చక పురోహిత విభాగ్ అజయ్ నారాయణం, సుంకరపాలెం బజరంగ్‌దళ్ కన్వీనర్ కొడవటి సాయి, సాప్తాహిక్ ప్రముఖ బోలిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

నేడు విశిష్ట వ్యక్తులకు సత్కారం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో విద్యాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఐదు గంటలకు విశిష్ట వ్యక్తులకు సత్కారం చేయనున్నట్లు సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మెరిపే శ్రీనుబాబు, పోలిశెట్టి శ్రీశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యుడు డా.చల్లా మల్లికార్జునశర్మ, ఉపాధ్యాయులు బుంగ జెస్సికళ, దొంగ చింతయ్య, కంకిపాటి నాగరాజు (ఎస్‌బీఐ)లను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మోహినీ భస్మాసుర నృత్య రూపకం


మోహినీ భస్మాసుర నృత్య రూపం

తణుకు టౌన్: స్థానిక ముళ్లపూడి తిమ్మరాజు స్మారక గ్రంథాలయం సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన మోహినీ భస్మాసుర నృత్య రూపం ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి డాక్టర్ చింతా రవి బాలకృష్ణ శిష్య బృందం నిర్వహించిన ఈ నృత్య రూపంలో వివిధ వృత్తాంతాలను తెలిపే నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. ముందుగా ఈ కార్యక్రమాలను ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం విలేకరులకు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.